# మావూరి కర్ణుడు

'పుష్యమి'

ఆయన దానకర్ణుడు, ధర్మరాజు!

ఆయన అసలు పేరేమిటో మా వూళ్ళో చాలామందికి తెలియదు.

ఇదివరకటిలో తెలిసి వుండినా, ఆ పేరుని మర్చిపోయారంతా.

అందరూ ఆయన్ని దానకర్ణుడు, ధర్మరాజుతో సమానంగా పిల్చి, పొలుస్తుంటారు.

అలా పిలవడమే మా వూరివాళ్ళని ఆయన అసలు పేరు మర్చిపోయేలా చేసింది.

నాకు మాత్రం ఆయన పేరు తెలుసు!

ఆ పేరు కూడా కొద్ది నెలల క్రితమే తెలిసింది.

అదీ ఆయన పేరు చాలా పేపర్లలో పబ్లిష్ కావడంవల్ల.

ఆయన పేరు విశ్వరూపం - సామాన్యమైన పేరు!

అయితేనేం - అది చాలా మందికి దేవుళ్ళ పేర్లకన్నా గొప్ప పేరు అయి కూర్చుంది.

విశ్వరూపం గారికి, రకరకాల వ్యాపారాలున్నాయి. లారీలు, సినిమా హాళ్ళు, రైస్‌మిల్లులు, రాజకీయాలు... ఆయన ఏ రంగంలో అడుగుబెడితే ఆయనకా రంగం బంగారం అయ్యింది.

బహుశా కోట్లు గడించి వుంటాడాయన.

లక్షాధికారన్నా గర్వం ఆయనలో నాకెప్పుడూ ఏ కోశానా కన్పించలేదు. వ్యాపారాల్లో లక్షలు సంపాదించడం కన్నా, ప్రజలకు సేవ చెయ్యడానికే ఎక్కువ ఆసక్తి చూపిస్తాడు.

మా వూరిలో ఆస్పత్రి లేదు.

చాలా ఏళ్ళుగా ఆస్పత్రి నిర్మించాలని మా వూరి వారందరూ ప్రభుత్వానికి ఎన్నో విన్నపాలు పంపుకున్నారు.

హాస్పిటల్ లేకపోయినట్లయితే తగ్గే జనాభా తగ్గుతారేమో అని కాబోలు ప్రభుత్వం మా విన్నపాలని వినలేదు.

అటువంటి తరుణంలో విశ్వరూపం ముందు కొచ్చి 'మన వూరి ఆస్పత్రికి, ఎక్కడో దూరాన కూర్చుని, మన వోట్లతో నోట్లు సంపాదించుకుంటున్న క్షుద్ర రాజకీయవేత్తలను ప్రాధేయ పడనవసరం లేదు.

ఇది మన వూరి సమస్య! మనమే పరిష్కరించుకోవాలి. మనందరం కలసికట్టుగా తలో పైసా చందాలు వేసుకుందాం. నా వంతుగా నేను లక్ష రూపాయలిస్తాను!' అన్నాడాయన హర్షధ్వానాల మధ్య.

కోట్లు గడించవచ్చు కాని జనం క్షేమం కోసం పాటుపడే ధనవంతులు ఎవరున్నారు? ఎక్కడున్నారు?

మా వూరివాళ్ళ అదృష్టం కొద్దీ దేవుడిలాంటి విశ్వరూపం మా వూళ్ళో పుట్టాడు.

ఆ విషయమై మా వూరివాళ్ళు గర్వపడి, ఆ భగవంతుడికి కృతజ్ఞతలు చెప్పుకున్నారు.

మేమందరమూ మా యధాశక్తి మా కష్టార్జితాన్ని హాస్పిటల్ నిర్మాణానికి అర్పించాము.

ఉదయపు తొమ్మిది గంటల నీరెండలో ఆ తారురోడ్డు మీద నడుచుకుంటూ, రెండు మైళ్ళ దూరంలో వున్న కాలేజికి వెళ్తున్నప్పుడల్లా చూస్తుండేవాడ్ని - దార్లో నిర్మాణంలో వున్న హాస్పిటల్‌ని.

కుప్పలుగా పోసిన మట్టి, ఇసుక, గుట్టలు పేర్చబడ్డ ఇటుకలు... దూరంగా వున్న చెట్ల గుబుర్లలో నుంచి కూతపెట్టే ఓ పిట్టపాట...

సూరీడుని వీపుల మీది కెక్కించుకుని చెమటలో తడుస్తూ, ఆ స్వేద బిందువులనే పవిత్ర గంగా స్నానంగా భావించి, కష్టించే శ్రమజీవులు...

కాలేజికి వెళ్తున్నప్పుడు, వస్తున్నప్పుడు నాకు చాలా తరచుగా కన్పించే దృశ్యం అది.

వాళ్ళు పునాదులకు తవ్విన గోతులు, మా వూరివాళ్ళ కష్టాల్ని పాతిపెట్టేటందుకే అన్న భ్రమని కలిగించాయి నాకు.

రోజురోజుకీ రూపు దిద్దుకుంటున్న ఆ ఆస్పత్రిని చూస్తుంటే, సంతోషంతో నా గుండె ఏ క్షణాన బ్రద్దలై పోతుందేమోనన్న అనుభూతి.

అప్పుడప్పుడూ నేనూ ఆ శ్రమలో పాలు పంచుకునేవాడ్ని. నాలాగే చాలామంది కూడా కష్టపడ్డారు ఆ ఆస్పత్రి నిర్మాణానికి.

మూడు నెలలు పూర్తయ్యే సమయానికి మా వూరికి ఆస్పత్రి లేని లోటు తీరింది.

ప్రభుత్వం ప్రతిపక్షాల విమర్శల తాకిడిని తట్టుకోలేక, మా వూరి ఆస్పత్రికై కొంత ధనాన్ని జారీ చేసింది.

ఆస్పత్రి ప్రారంభించిన రోజు...

నా జీవితంలోని అద్భుతమైన రోజుల్లో మరొకటి...

ఆనందం, కృతజ్ఞత, గుర్పాటు... మాలోని ఆ కాసిన్ని భావాలు కలగా పులగమై, కన్నెపిల్లల్లా కలవరం కలిగించాయి ఆనాటి షామియానాలో.

పడమటి నుంచి వీచిన గాలి, ఆస్పత్రి గుమ్మానికి వ్రేలాడదీసిన మామిడాకుల తోరణాన్ని తాకీ తాకనట్లు మృదువుగా స్పృశించినప్పుడు ఆ మామిడాకులు చిన్నగా చేసిన చప్పుడు...

నా చెవులకు వంశీరవమైంది.

మా వూరి ఆస్పత్రికి విశ్వరూపం గారి పేరే పెట్టుకున్నాం.

విశ్వరూపం వైద్యశాల!

ఆయన సభాముఖంగా సుతారంగా తిరస్కరించబోయాడు.

మేమంతా పట్టుబట్టి, ఆయన బెట్టుని సడలించాం.

మా మంచి కోసం ముందుకొచ్చి నిల్చిన మనిషికి మేమింతకన్నా ఏం సమర్పించుకోగలం? ఆయనని మా జ్ఞాపకాల గుళ్ళో దేవుడిగా ప్రతిష్టించుకోవడం తప్ప.

ఇదొక్క చిన్న ఉదాహరణ మాత్రమే - ఆయన దానశీలతకు.

విశ్వరూపం గారికి దైవభక్తి కూడా ఎక్కువే! అందుకే ఆయన పాలరాతితో గుడి కూడా కట్టించారు - వూరికి మధ్యగా.

చర్చి, మసీదు నిర్మాణానికి ఉచితంగా స్థలం ఇప్పించాడు.

ఆ తెల్లటి పాలరాతి మండపం... హారతి కర్పూరపు సువాసన, అగరొత్తుల వాసన జమిలిగా మాలోని అశాంతిని జోకొట్టడం... గుడి ప్రాంగణాన అరవిరిసిన సుమ బాలలు పరిమళాన్ని వెదజల్లుతూ, మా హృదయాలను ఆహ్లాద నిలయాలుగా చేసిన ఆ సాయంత్రాలు...

'టంగ్ టంగ్' మంటూ మృదు మధుర నిస్వన నాదాన్ని ఆలపించి, మాలో కొత్త ఉత్తేజాన్ని నింపిన, ఆ గంట మ్రోగిన ప్రత్యూషాలు...

వెన్నెల రాత్రుల్లో...

మబ్బుచాటు నుంచి చంద్రుడు ఓరగా తొంగి చూసి, ఆనంద రహస్యాన్ని వివరిస్తున్న వేళ...

ధ్వజ స్తంభం దాపున కూర్చుని, నా ఆలోచన లన్నింటిని అక్షరాలుగా మార్చేయడం...

ఆ ఆనందపు క్షణాలన్నీ మాకు విశ్వరూపంగార్ని గుర్తుకు తెప్పించాయి.

ఆయనే గాని కట్టించకపోతే,

మాకీ ప్రార్థనా మందిరాలేవీ? మా కృతజ్ఞతను ఏ విధంగా వెల్లడించుకోవాలో మాకయితే అర్థం కాలేదు.

ఒక్క పూల దండతోనో,

నమస్కారం తోనో తీరేది కాదు.

అందుకే మా కృతజ్ఞతని ఓ చిన్ని రాతిపలకలో నిక్షిప్తం చేసి, మందిరాల్లో వుంచాం.

ప్రతి ఏడాది శ్రీరామ నవమికి ఆయన పేద సాదలందరికీ పంచభక్ష్య పరమాన్నాలతో అన్నదానం చేసేవారు.

వరదలు, కరువు కాటకాలు వచ్చినప్పుడు బాధతో చప్పున కదిలిపోయేవారు అందరికంటె ముందుగా.

రోడ్డుకి అడ్డంగా పడిపోయిన చెట్లు - గుట్టలు గుట్టలుగా రాలిన ఆకులు...

ఓ ప్రక్కకి వొరిగిపోయిన కరెంట్, టెలిఫోన్ స్తంభాలు...

ఆ కాళరాత్రి కురిసిన తుపాను ప్రజల కళ్ళల్లో కన్నీళ్ళుగా నిల్చిపోతే...

మా కుర్రవాళ్ళందరమూ ఆయన ఆదేశాల మేరకు నడుం బిగించి, ముందుకి దూకాం.

విశ్వరూపం గారు పత్రికాముఖంగా లక్ష రూపాయలు ప్రకటించారు. అంతా కలిసి చందాలు వేసుకుంటే దగ్గరుండి అన్ని పనులు పర్యవేక్షించారు.

ప్రభుత్వమెప్పుడో... అంతా అయిపోయిన నాల్గైదు రోజులకు సహాయ కార్యక్రమాలు చేపట్టింది.

తిరిగి ఇళ్ళు నిర్మించుకోవడానికి ప్రభుత్వం ఇచ్చిన డబ్బుని దగ్గరుంచి, సద్వినియోగం చేయించాడు.


ఆనాడు ఆయన చరణాలను తాకిన మా చేతులు పవిత్రతను పులుముకున్నాయి.

వరద బాధితులయితే, భోరున ఆయన్ని పట్టుకుని ఏడ్చేశారు. కృతజ్ఞతతో ఆ బాధితుల కన్నీళ్ళ కళ్ళల్లో మెరిసిన తడి-

వర్షపు ఆకాశంలో మెరిసిన మెరుపు...

బాషకి మూగదనం వచ్చిందానాడు.

'అయ్యా! మీరు... దేవుడు...' అని పలకడానికి గొంతులెంతగా వణికి పోయాయో?!



మాటలు రాకపోగా, ఆ కృతజ్ఞత హృదయాన్ని ఏడ్పించింది.

బదులుగా మందహాసం మాత్రమే చేశారు విశ్వ రూపం.

నీలి ఆకాశంలో గాలి కదలికలా, వర్షాకాలపు సెల యేటి గల గలలా, గుళ్ళోని రాతి దేవుడు చల్లగా నవ్వినట్లు...

ఎంతటి ప్రేమ భరితం, దయా పూరితం అయిన చిరునవ్వు అది!

ఈసారి నిర్మించుకున్న కాలనీకీ

ఆయన పేరే! విశ్వరూపం కాలనీ!

మళ్ళీ మా ప్రయత్నాన్ని వారించ బోయారాయన. గట్లు తెగిన అభిమానపు వెల్లువను ఆపడం ఆయనకు అసాధ్యం అయ్యింది.

ఆ పేరే స్థిరపడింది!

విశ్వరూపం గారి దానధర్మాలు,. ఉదార హృదయం గురించి ఎంత చెప్పుకున్నా, ఇంకా కొంత మిగిలిపోక తప్పదు.

మా కాలేజీలో ఆయన పేరిట ఓ స్కాలర్‌షిప్ ఏర్పాటు చేయబడింది. క్లాస్‌లో ఫస్ట్ వచ్చిన విద్యార్థికి ఆ సంవత్సరం కట్టాల్సిన ఫీజులన్నీ ఆయనే కడతారు. ఆ విద్యార్థి కొనదలచుకున్న పుస్తకాలు కొనిపెడతారు.

ఇవికాక సంవత్సరానికి అదనంగా వంద రూపాయలిస్తారు.

నా అదృష్టవశాత్తూ... ఇంటర్మీడియెట్‌లో మా కామర్స్ గ్రూప్‌లో నేనే ఫస్ట్ మార్కు సంపాదించుకున్నాను. దానితో నాకు విశ్వరూపం గారి స్కాలర్‌షిప్ దక్కింది.

నా చదువుకి సహాయపడతారన్న భావన కన్నా, నా ప్రతిభని ఆయన గుర్తించడమే నన్నెక్కువ ఆనందపరచింది.

ప్రతి టెర్మ్ ఆయన నివాసానికి వెళ్ళి, ఫీజు డబ్బులు తెచ్చుకునేవాణ్ణి.

వెళ్ళిన ప్రతిసారి ఆయన ఆప్యాయంగానే సంభాషించేవారు. నా చదువు గురించి, కాలేజీ గురించి

వివరాలడిగి తెలుసుకుని, మరీనన్ను అభినందించేవారు.

అప్పుడు... ఆ ఇంట్లో వున్న పదిక్షణాలు స్వర్గంలో విహరిస్తున్నట్లు భ్రాంతి చెందేవాడ్ని.

ఆయన ఫోటో ఫ్రేమ్ కట్టించి నా మంచం పక్కనున్న గోడకి వ్రేలాడదీసాను.

★ ★ ★

ఆ రోజు మార్చి నెల మూడవ వారం...

ఉగాది కన్నా ముందే వేసవి వచ్చిందేమోనన్న భ్రమని కలిగించేంతటి వేడి...

సూర్యుడు రోడ్లని వేడెక్కిస్తున్నాడు.

మా తరగతి గదిలో మరీ ఉక్కపోతగా ఉంది. ఊపిరి ఆడటం లేదు. కొంచెం వెచ్చని గాలి... చెమట కారిపోతోంది.

అప్పుడు చటుక్కున గుర్తొచ్చింది నాకు! పరీక్ష ఫీజు కట్టడానికి ఆ రోజే ఆఖరి రోజు! నా క్లాస్‌మేట్స్ అంతా కట్టేశారు.

ఇక మిగిలింది నేనొక్కడ్నే.

బ్యాంక్ రెండు గంటల వరకే పనిచేస్తుంది. పదకొండు అయిదు నిమిషాలకు కాలేజి నుంచి బయటికి వచ్చేశాను.

విశ్వరూపం గారి దగ్గరకు వెళ్ళి, ఫీజు డబ్బులు తెచ్చుకోవాలి.

పరుగు తీసినట్లు నడిచాను.

ఊరికి చివరగా ఉంది విశ్వరూపంగారి భవంతి!

నడుచుకుంటూ, ఆయనింటికి చేరుకునే సరికి పదకొండున్నర దాటిపోయింది. సమయానికి ఇంట్లోనే వున్నారు విశ్వరూపంగారు... వెంటనే ఇచ్చారు.

ఆ నోట్లని తీసుకుంటుంటే, ఎందుకో చేతులు వణికాయి.

విశ్వరూపం గారింటికి, బ్యాంక్‌కి మధ్య ఎంతో దూరం లేదు - హడావుడిగా వెళ్ళి, ఫీజు కట్టేశాను.

అదంతా అయ్యేటప్పటికి పన్నెండున్నర! మధ్యాహ్నపు వీధులన్నీ నిశ్శబ్దంగా ఉన్నాయి.

ఎండ... ఎండ!

నిమిషానికోమారు ముఖానికి పట్టిన చెమటను అరచేతులతో తుడుచుకుంటున్నాను.

ఏ ఇంటి పెరడులోని చెట్టుమీద నుంచో ఓ కాకి అరుస్తుంది.

వడివడిగా అడుగులేస్తున్నాను.

విశ్వరూపంగారి వీధిలోకొచ్చాను.

ఇంటి ముందే నిలబడి వున్నాడాయన - చేతులు వెనక్కి కట్టుకుని.

ఆయన్ని చూడగానే నా నడక వేగం సగానికి పైగా తగ్గిపోయింది. ఆయన ఇంటిని నేను దాటుతాననగా ఓ రెండు నిమిషాల ముందు జరిగిందా సంఘటన.

ఒక ముసలి భిక్షగాడు-

వయసు శరీరాన్ని క్రుంగదీయగా-

ఆకలి అస్థిపంజరంగా మార్చగా...

అశక్తతో వణుకుతూ, ఆ ఇంటి ప్రాంగణం ముందుకొచ్చి నిలబడ్డాడు. 'బాబూ! ఓ ముద్ద పెట్టించండి! ఆకలితో సచ్చిపోతున్నాను. కాస్త అన్నం పెట్టించండయ్యా!' అడుక్కోవడానికి అంత ఓపికెలా వచ్చిందోగాని, అరిచాడు.

అప్పుడే భోంచేసి వచ్చినట్లున్నారు విశ్వరూపం గారు. బదులివ్వకుండా 'బ్రేవ్'మని త్రేన్చారు.

మరోమారు ఎలుగెత్తి, ప్రాధేయపడ్డాడా బిచ్చగాడు.

'పో, పోరా ముసలాడా!' తీవ్రంగా కసిరాడు విశ్వరూపం.

నిర్ఘాంతపోయాను నేను.

మరొక్కసారి వేడుకున్నాడు బిచ్చగాడు.

'ఎన్నిసార్లు చెప్పాలిరా! నీలాంటి... వాళ్ళతో అరిచి మా నోరు పడిపోవాలా? వెళ్ళిపో!' అంటూ అతడి మెడమీద చేయివేసి, విసురుగా వెనక్కి నెట్టాడు విశ్వరూపం.

బిచ్చగాడి తల నేల మీదున్న రాయికి కొట్టుకుని రక్తం రాసాగింది. అతడి చేతిలోని చిప్ప వెళ్ళి దూరంగా పడింది.

విశ్వరూపం ఇంట్లో కెళ్ళిపోయాడు. బిచ్చగాడు ఓపిక తెచ్చుకుని లేచి తూలుతూ నడిచాడు.

మా వూరి దానకర్ణుడు ఇలా మారిపోయాడేమిటి? అతని ఆకలి తీర్చడం విశ్వరూపానికి బరువా?

ఈ ప్రశ్న నన్నాక్షణం నుంచి చాలా రాత్రులు, ఉదయాలు వేధించింది. ఆలోచిస్తే, స్ఫురించింది.

నాకు ఆయన కొన్ని ప్రతి పుస్తకం మీద 'డొనేటెడ్ బై విశ్వరూపం' అని రాసి ఉంటుంది.

నా కళ్ళ ముందు ఎన్నో దృశ్యాలు మెదిలాయి.

పేపర్లలో ఆయన ఫొటోలు - ప్రత్యేక వ్యాసాలు...

ప్రార్థనా మందిరాల్లో తాపడం చేసిన రాతి పలకల మీద ఆయన పేరు-

విశ్వరూపం హాస్పిటల్!

విశ్వరూపం కాలనీ!

విశ్వరూపం స్కాలర్‌షిప్!!

ఓ ముసలి బిచ్చగాడికి కడుపునిండా అన్నం పెడితే ఆయన పేరు చరిత్రలో నిలబడదుగా?!